క్లుప్తంగా

నగర వనంలో 'జిమ్'



జిమ్ ప్రారంభిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి మంగళం : తిరుపతిలోని నగర వనంలో అటవీశాఖ అధికారులు నూతనంగా ఏర్పాటు చేసిన జిమ్‌ను కలెక్టర్ వెంకటేశ్వర్ శుక్రవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ తిరుపతి నగర వాసులకు నగర వనం ఆహ్లాదం పంచుతోందన్నారు. జేసీ శుభం బన్సల్, జిల్లా అటవీశాఖాధికారి సతీష్‌రెడ్డి, జూ క్యూరేటర్ సెల్వం, స్టేట్ సిల్వి కల్చరిస్ట్ యశోదబాయ్ పాల్గొన్నారు.

ఎయిర్‌పోర్ట్ అభివృద్ధికి వినతి

తిరుపతి కల్చరల్ : తిరుపతి ఎయిర్ పోర్టు అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని కస్తూర్బా గాంధీ కేంద్ర ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ పీసీ రాయులు విన్నవించారు. శుక్రవారం ఈమేరకు కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. అనంతరం ఆయనను ఘనంగా సత్కరించారు. ఎయిర్ పోర్టు అభివృద్ధిపై కలెక్టర్‌తో చర్చించారు. రాయులు మాట్లాడుతూ ఢిల్లీ, ముంబయి నుంచి డైరెక్ట్ విమానాలు రాకపోకలు సాగించేందుకు కృషి చేయాలని కోరారు. విజయవాడ నుంచి తిరుపతికి మరిన్ని విమానాలను నడిపేందుకు చర్యలు తీసుకోవాలన్నారు.

చెట్ల నరికివేతపై నిరసన

తిరుపతి సిటీ : ఎస్వీయూలో రెండు రోజులుగా సాగుతున్న చెట్ల నరికివేతపై ఎఐఎస్‌ఎఫ్, ఎస్‌ఎఫ్‌ఐ సంఘాలు నిరసన వ్యక్తం చేశాయి.. శుక్రవారం వర్సిటీ పరిపాలనా భవనం ఎదుట ధర్నాకు దిగాయి. రిజిస్ట్రార్ స్పందిస్తూ వర్సిటీకి నష్టం కలిగే ఏ విషయాన్ని ప్రోత్సహించమని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అక్బర్, నవీన్, రవి, ప్రవీణ్, విద్యార్థి సంఘాల నాయకులు చంద్ర, రంజిత్, యువ, వినోద్, నరేంద్ర, వీరేష్ పాల్గొన్నారు.

చెట్లు ప్రగతికి మెట్లు



మొక్క నాటుతున్న ఎంఈఓ లలిత కుమారి

చంద్రగిరి: ప్రతిఒక్కరూ ఒక మొక్కను నాటి వాటిని సంరక్షించడం ద్వారా రాష్ట్రం సస్యశ్యామలంగా మారుతుందని ఎంఈఓ లలిత కుమారి అన్నారు. వన మహోత్సవంలో భాగంగా శుక్రవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో కలసి మొక్కలు నాటించారు. హెచ్‌ఎం విజయ పాల్గొన్నారు.

వేడుకగా లక్ష కుంకుమార్చన



కుంకుమార్చన నిర్వహిస్తున్న అర్చకులు

తిరుపతి కల్చరల్: శ్రావణమాసంలో చివరి శుక్రవారం సందర్భంగా శ్రీకపిలేశ్వరస్వామి వారి ఆలయంలో శ్రీకామాక్షి అమ్మవారికి వేడుకగా లక్షకుంకుమార్చన నిర్వహించారు. ఇందులో భాగంగా ఆలయంలోని మండపంలో శ్రీమహాలక్ష్మి అమ్మవారు, శ్రీసరస్వతి అమ్మవారు, శ్రీకామాక్షి అమ్మవార్లను కొలువుదీర్చి కుంకుమార్చన శాస్త్రోక్తంగా చేపట్టారు.

తిరుపతి గంగమ్మకు విశేష పూజలు

భాకరాపేట : శ్రావణ శుక్రవారం సందర్భంగా చిన్నగొట్టిగల్లు చెరువు కట్టపై వెలసిన శ్రీ తిరుపతి గంగమ్మకు శుక్రవారం విశేష పూజలు నిర్వహించారు. అమ్మవారికి వేకువజామున అభిషేకం, అర్చనలు నిర్వహించి, ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. మహిళలు బోణాలు సమర్పించారు. భక్తులకు ఆలయ ధర్మకర్తలు భక్తులకు రాగిజావా పంపిణీ చేశారు.

రోగి అదృశ్యంపై ఆందోళన



స్విమ్స్ వద్ద ఆందోళన చేస్తున్న రోగి బంధువులు, ఎమ్మార్పీఎస్ నాయకులు

తిరుపతి తుడా: తిరుపతి స్విమ్స్ శ్రీ పద్మావతి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ అదృశ్యమైన రోగి సీతారామప్ప బంధువులు ఆందోళనకు దిగారు. అన్నమయ్య జిల్లా రామసముద్రం మండలం బురవమాకుల పల్లెకు చెందిన సీతారామప్పను మంగళవారం స్విమ్స్‌లో చేర్పారు. వైద్యులు పరీక్షించి ఊపిరితిత్తుల సమస్యకు చికిత్స చేసేందుకు పద్మావతీ ఆస్పత్రిలో చేర్పారు. ఆయన మంగళవారం అర్ధరాత్రి తర్వాత ఆస్పత్రిలో లేడు. ఈ మేరకు శుక్రవారం స్విమ్స్ వద్ద రోగి బంధువులతో కలిసి ఆందోళన చేశారు. స్విమ్స్ డైరెక్టర్ ఆర్వీ కుమార్, సూపరింటెండెంటు డాక్టర్ రామ్ ఆందోళనకారులతో చర్చించారు.

మంచి చట్టాలు వస్తాయని ఆశిద్దాం



కోల్‌కతాలో వైద్యురాలి పట్ల జరిగిన ఘటన తీవ్ర ఆందోళన కలిగించింది. అమానవీయంగా ఘటన చోటుచేసుకున్న వెంటనే ప్రజా స్పందన ఊహించిన స్థాయిలో వచ్చింది. సుప్రీంకోర్టు సైతం కేసును సుమోటోగా స్వీకరించింది. క్షేత్రస్థాయిలో విచారణ జరిపిన న్యాయమూర్తులు కొన్ని మార్గదర్శకాలను తీసుకొచ్చారు. తక్షణం వీటిని అమలు చేయడంతో పాటు ప్రభుత్వాలు సైతం వచ్చే శీతాకాల సమావేశంలో మహిళా వైద్యుల సంరక్షణకు కఠినమైన తీసుకువస్తాయని ఆశిద్దాం.

– డాక్టర్ గంటా రాజశేఖర్, తిరుపతి.



స్థానికంగాను భద్రత పెరగాలి



ప్రభుత్వ ఆస్పత్రులు, కళాశాలల్లో వైద్య విద్యార్థినుల రక్షణకు భద్రత పెరగాలి. కళాశాల, ఆస్పత్రి అధికారులు, జిల్లా అధికారులు, పోలీసులు, జూనియర్ డాక్టర్లతో ప్రతి ఆస్పత్రిలోనూ కమిటీ ఉండాలి. జూనియర్ డాక్టర్ల సలహాలు, సూచనలు తీసుకొని వాటిని వేగవంతంగా పరిష్కరించగలిగితే మాలో ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. ఆసుపత్రుల్లో జూనియర్ డాక్టర్లపై దాడులను అరికట్టవచ్చు. ముఖ్యంగా అత్యవసర విభాగం వద్ద కట్టుదిట్టమైన భద్రత ఉండాలి. రోగి సహాయకుల రాకపోకలపై ఆంక్షలు విధించాలి.

– డాక్టర్ శ్రీలక్ష్మి, తిరుపతి.

అంగప్రదక్షిణం.. గందరగోళం

శ్రీవారి భక్తులకు టీటీడీ చుక్కలు చూపిస్తోంది. ముఖ్యంగా తిరుమల.. తిరుపతి వాసులతో కక్షపూరితంగా వ్యవహరిస్తోంది. వైకుంఠనాథుని కరుణాకటాక్ష వీక్షణాలకు పరితపించే వారిని నిబంధనలతో వేధిస్తోంది. ప్రధానంగా దేవదేవుని సన్నిధిలో అంగప్రదక్షిణ ఆచరించాలనుకునే స్థానికులను చిన్నచూపు చూస్తోంది. అందులో భాగంగా శనివారం మాత్రమే కేటాయించే టోకెన్లను లక్కీడిప్ ద్వారా జారీ చేసేలా మార్పు చేసింది. అక్కడితో ఆగకుండా అవకాశం లభించిన వారు రూ.500 డిపాజిట్ చేయాలని ప్రకటించింది. స్థానికేతరులకైతే ముందస్తుగా కట్టిన సొమ్మును తిరిగి చెల్లించే ప్రసక్తే లేదని స్పష్టం చేసింది. టీటీడీ వివాదాస్పద నిర్ణయంపై అశేష భక్తజనం ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. వడ్డీకాసులవాడి సేవకు ఈ వద్దన ఏంటని మండిపడుతోంది.

- తిరుపతి.. తిరుమల వాసులకు శనివారం కేటాయింపు
- లక్కీడిప్‌లో టోకెన్ పొందితే రూ.500 డిపాజిట్ చేయాల్సిందే
- ఇతర ప్రాంతాల వారి చెల్లింపులను రీఫండ్ చేయమని టీటీడీ స్పష్టీకరణ
- అసంబద్ధ నిబంధనలపై స్థానికుల ఆగ్రహం



తిరుమల : తిరుమలలో అంగప్రదక్షిణ టోకెన్ల జారీకి సంబంధించి టీటీడీ నూతనంగా తీసుకువచ్చిన నిబంధన వివాదస్పదమవుతోంది. ప్రతి శనివారం స్థానికులకు కేటాయించే అంగప్రదక్షిణ టోకెన్లను ఇకపై లక్కీడిప్ ద్వారా జారీ చేయాలని టీటీడీ నిర్ణయించింది. ఈ టోకెన్లని తిరుపతి అర్బన్, తిరుమల వాసులకు మాత్రమే పరిమితం చేయడంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. డిప్‌లో టోకెన్ పొందిన వారు రూ.500 డిపాజిట్ కట్టాలని నిబంధన విధించడంతో స్థానికులు మండిపడుతున్నారు.

గర్భాలయం చుట్టూ..

శ్రీవారికి చెల్లించే అనేక మొక్కుల్లో అంగప్రదక్షిణ ప్రత్యేకమైంది. తడిబట్టలు ధరించి గర్భాలయం చుట్టూ పొర్లు దండాలు పెట్టడమే అంగప్రదక్షిణ అంటారు. దేవదేవుని గర్భాలయం చుట్టూ ప్రదక్షిణ చేసే అవకాశం ఈ సేవ ద్వారా లభిస్తుంది. శ్రీవారి ఆలయంలో రద్దీ దృష్ట్యా నిత్యం పరిమిత సంఖ్యలోనే భక్తులను అంగప్రదక్షిణ దర్శనానికి టీటీడీ అనుమతిస్తుంది. ఇందుకోసం గతంలో ఆఫ్ లైన్‌లోనే భక్తులకు అంగప్రదక్షిణ టోకెన్లను జారీ చేసేవారు. రెండేళ్ల నుంచి ఆన్‌లైన్‌లో 3 నెలల ముందుగా టోకెన్ల జారీ చేపట్టారు.

గతంలో ఇలా..

అంగప్రదక్షిణ ఆన్‌లైన్ చేసిన నేపథ్యంలో తిరుమల, తిరుపతివాసులకు టోకెన్లు పొందడం కష్టతరం మారింది. దీంతో ప్రతి శనివారం 250 టోకెన్లను స్థానికులకు టీటీడీ కేటాయించడం ప్రారంభించింది. ఈ క్రమంలో స్థానికులు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అంగప్రదక్షిణ టోకెన్లను పొందేవారు. అయితే గత రెండు వారాలుగా ఈ టోకెన్ల జారీ విధానంలో టీటీడీ మార్పులు చేసింది. స్థానికులకు కేటాయించే కోటాను ఆన్‌లైన్‌లోనే జారీ చేసేలా చర్యలు చేపట్టింది. ఈ విధానంతో స్థానిక భక్తులకు టోకెన్ల దొరకడం మళ్లీ కష్టంగా మారింది. దీంతో పలువురు తమ ఇబ్బందులను టీటీడీ దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన టీటీడీ మరో వివాదాస్పద విధానానికి శ్రీకారం చుట్టింది.

స్థానికేతరులకు షాక్!

తిరుమల, తిరుపతి అర్బన్‌వాసులు కాకుండా ఇతర ప్రాంతాల వారు సైతం ఆన్‌లైన్‌లో అంగప్రదక్షిణ టోకెన్ కోసం రిజిస్టర్ చేసుకునే అవకాశముంది. అయితే లక్కీడిప్‌లో వారికి టోకెన్ వచ్చి రూ.500 డిపాజిట్ చెల్లించినా టీటీడీ మాత్రం టికెట్ మంజూరు చేయదు. దీనికితోడు వారి డిపాజిట్‌ను తిరిగి ఇవ్వదు.

వెల్లువెత్తుతున్న విమర్శలు

టీటీడీ అమలులోకి తెచ్చిన నూతన నిబంధనలపై భక్తులు తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. సులభతరంగా పొందే టోకెన్లను కష్టతరంగా మార్చడంపై మండిపడుతున్నారు. ప్రతి వారం టోకెన్ దక్కుతుందో లేదో కూడా తెలియని గందరగోళ పరిస్థితిని తీసుకువచ్చారని విమర్శిస్తున్నారు. పాత విధానంలోనే అంగప్రదక్షిణ టోకెన్లు జారీ చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

నూతన విధానం ఇలా..

ప్రతి శనివారం స్థానికులకు ప్రత్యేకంగా కేటాయిస్తున్న 250 అంగ ప్రదక్షణ టోకెన్లను లక్కీడిప్ ద్వారా కేటాయిస్తారు. టోకెన్ కావలసిన భక్తులు గురువారం ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు తమ ఆధార్ కార్డుతో ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. అదే రోజు సాయంత్రం 5 గంటలకు లక్కీడిప్ ద్వారా భక్తులకు టోకెన్ జారీ చేస్తారు. ఈ మేరకు తొలుత భక్తుల మొబైల్‌కు మెసేజ్ వస్తుంది. వెంటనే సదరు భక్తుడు రూ.500 ఆన్‌లైన్‌లోనే చెల్లించాలి. మళ్లీ టోకెన్ తీసుకునేందుకు శుక్రవారం మధ్యాహ్నం 2 నుంచి రాత్రి 8 గంటలలోపు తిరుపతిలోని మహతి కళాక్షేత్రానికి వెళ్లి టోకెన్ తీసుకోవాలి. భక్తుడు అంగప్రదక్షిణ పూర్తి చేసుకున్న తర్వాత రూ.500 డిపాజిట్‌ను రీఫండ్ చేస్తారు.

రూ.25.50 లక్షలకు చేపల చెరువుల వేలం

తిరుపతి తుడా : తిరుపతి నగరపాలక సంస్థ పరిధిలోని శెట్టిపల్లె చేపల చెరువు, చక్రాల గుంటకు శుక్రవారం నిర్వహించిన బహిరంగ వేలం పాట ద్వారా రూ. 25.50 లక్షలు ఆదాయం వచ్చినట్లు కమిషనర్ ఎస్.మౌర్య తెలిపారు. కమిషనర్ చాంబరులో నిర్వహించిన వేలంలో మహేష్ యాదవ్ రూ. 25.50 లక్షలకు పాట దక్కించుకున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఉప కమిషనర్ అమరయ్య, రెవెన్యూ ఆఫీసర్ కేఎల్ వర్మ, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు జ్యోతిష్ రెడ్డి, నవీన్ కుమార్, నరేష్ పాల్గొన్నారు.

మంచినీళ్ల కుంట పరిరక్షణకు చర్యలు



మంచినీళ్ల గుంటను పరిశీలిస్తున్న కమిషనర్ మౌర్య

తిరుపతి తుడా: పురాతన ప్రాశస్త్యం కలిగిన మంచినీళ్ల కుంటను పరిరక్షించేందుకు తగిన చర్యలు చేపట్టాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. శుక్రవారం 23, 24, 25 వార్డుల పరిధిలోని పలు ప్రాంతాల్లో కార్పొరేటర్ నరసింహాచారి, ఇంజినీరింగ్, హెల్త్ అధికారులతో కలసి పారిశుధ్య పనులను ఆమె పరిశీలించారు. పారిశుధ్య పనులు మరింత మెరుగ్గా చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అనంతరం మంచినీళ్ల కుంటను పరిశీలించారు. మంచినీళ్ల కుంటను పరిరక్షించేందుకు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కమిషనర్ వెంట మునిసిపల్ ఇంజినీర్ చంద్రశేఖర్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్ రెడ్డి, డి.ఈ.రాజు, తేజస్విని, డీసీపీ శ్రీనివాసులు రెడ్డి, శానిటరీ సూపర్‌వైజర్ చెంచయ్య, ప్లానింగ్ సెక్రెటరీలు ఉన్నారు.

మోసం చేసిన వస్త్రవ్యాపారి ?

- మహిళా ఇంటి ఎదుట పురుగుల మందుతో బాధితుడి బైఠాయింపు



నిరసన తెలుపుతున్న సాయికుమార్

చంద్రగిరి: నమ్మించి వస్త్ర వ్యాపారం చేస్తూ డబ్బులు ఇవ్వకుండా తనను ఓ మహిళ మోసం చేసిందంటూ బాధితులు మహిళా ఇంటి ఎదుట పురుగుల మందు డబ్బాతో నిరసనకు దిగిన ఘటన శుక్రవారం వెలుగులోకి వచ్చింది. బాధితుడి వివరాల మేరకు.. ధర్మవరానికి చెందిన వస్త్రవ్యాపారి సాయికుమార్ వద్ద తొండవాడ పంచాయతీకి చెందిన గాయత్రి గత కొంత కాలంగా వస్త్రాలను తీసుకొచ్చి వ్యాపారం సాగిస్తూ వచ్చేది. దీంతో సాయికుమార్ ఆ మహిళను నమ్మి సుమారు రూ.50లక్షల విలువైన వస్త్రాలను అప్పుగా ఇస్తూ వచ్చాడు. ఇరువురూ పెద్ద మనుషుల సమక్షంలో మొత్తం నగదు రూ.34లక్షల బకాయిను తీసుకునేందుకు అంగీకరించినట్లు బాధితుడు తెలిపాడు. అయితే కేవలం అందులో రూ.4లక్షలు మాత్రమే మహిళా వ్యాపారి ఇచ్చిందని, మిగిలిన నగదును అడిగితే తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తోందంటూ ఆవేదన వ్యక్తం చేశాడు. బకాయి డబ్బులు చెల్లించకపోతే ఆత్మహత్య శరణ్యమంటూ పురుగుల మందు తీసుకుని నిరసనకు దిగినట్లు బాధితుడు తెలిపారు. డయల్ 100 ద్వారా ఫిర్యాదు అందుకున్న పోలీసులు శుక్రవారం ఘటన స్థలానికి చేరుకుని బాధితుడిని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం పోలీసు స్టేషన్‌కు తరలించి, విచారిస్తున్నారు. ఇదిలా ఉండగా వస్త్ర వ్యాపారి గాయత్రి మాట్లాడుతూ తాను సాయి కుమార్ ఇవ్వాల్సిన నగదు రూ.3.5లక్షలు మాత్రమేనని తెలిపారు. అయితే సాయి కుమార్ తరచూ ఇలా వచ్చి బెదిరింపులకు పాల్పడుతున్నట్లు వాపోయారు.

విద్యార్థుల అభివృద్ధికి కృషి అభినందనీయం



పదవీ విరమణ పొందిన హెచ్‌ఎం జయబాలను గజమాలతో సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

పాకాల: మండలంలోని మణిపిరెడ్డిపల్లి ఎంపీపీ పాఠశాలలో హెచ్‌ఎంగా పనిచేస్తున్న పేరూరి జయబాల పదవీ విరమణ పొందిన సందర్భంగా ఘనంగా సత్కరించారు. ఈ సన్మాన కార్యక్రమాన్ని శుక్రవారం మణిపిరెడ్డిపల్లికి సమీపంలోని కల్యాణ మండపంలో ఎంఈఓ బాబ్జి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ విద్యార్థుల అభివృద్ధికి నిత్యం కృషి చేసిన వ్యక్తి జయబాల అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ-2 లింగయ్య, బీటీఏ నాయకులు గుండ్లపల్లి ఆంజనేయులు, ఆదికేశవులు, కృష్ణమూర్తి, రామచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

సామూహిక వరలక్ష్మీ వ్రతం

తిరుపతి కల్చరల్: శ్రావణమాసం చివరి శుక్రవారం కావడంతో రాస్ సేవా నిలయంలో శుక్రవారం మహిళలు సామూహిక వరలక్ష్మీ వ్రత పూజలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. సేవా నిలయంలో అమ్మవారి ఉత్సవమూర్తిని కొలువుదీర్చి పండితుల వేద మంత్రోచ్ఛరణల నడుమ మహిళలు వరలక్ష్మీ వ్రత పూజలు చేపట్టారు. యూనియన్ బ్యాంక్ డీజీఎం టి.రామ్‌ప్రసాద్, రాస్ ప్రధాన కార్యదర్శి వెంకటరత్నం, రాస్ సంయుక్త కార్యదర్శి మమత పాల్గొన్నారు.

వైద్యం.. సాంకేతికత అవసరం



జ్యోతి ప్రజ్వలనలో అతిథులు

తిరుపతి తుడా: వైద్యరంగంలో సాంకేతిక పరిజ్ఞానం మరింత అవసరమని ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం తెలిపారు. శుక్రవారం తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాలలో నిర్వహించిన ప్రజా ఆరోగ్య జాతీయ సదస్సు ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కోవిడ్ సమయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమష్టిగా పనిచేసి ప్రజల ప్రాణాలు కాపాడాయన్నారు. ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మాట్లాడుతూ వ్యక్తిగత పరిశుభ్రతపై జనం మరింతగా దృష్టి సారించాలని కోరారు. కలెక్టర్ వెంకటేశ్వర్ మాట్లాడుతూ రోగులతో వైద్యులు మానవతా దృక్పథంతో వ్యవహరించాలని సూచించారు. అనంతరం ఎస్వీఎంసీ హెల్త్ బులెటిన్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో రుయా సూపరింటెండెంట్ రవిప్రభు, ప్రిన్సిపల్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

- పాకాల సీఐగా మద్దయ్య ఆచ్చారి బాధ్యతల స్వీకరణ



సీఐ మద్దయ్య ఆచ్చారి

పాకాల : సమస్యల సత్వర పరిష్కారానికి కృషిచేస్తానని పాకాల సీఐ మద్దయ్య ఆచారి తెలిపారు. ఆయన స్థానిక పోలీస్ స్టేషన్‌లో సీఐగా శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ, సమస్యల సత్వర పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

తిరుచానూరు ఎస్‌ఐల బాధ్యతల స్వీకరణ





ఎస్‌ఐ అరుణ ఎస్‌ఐ సాయినాథ్

తిరుచానూరు(చంద్రగిరి): తిరుచానూరు ఎస్‌ఐలుగా అరుణ, సాయినాథ్ శుక్రవారం బాధ్యతలను స్వీకరించారు. తిరుపతి దిశలో ఎస్‌ఐగా పనిచేస్తున్న అరుణ, తిరుపతి సీసీఎస్‌లో పనిచేస్తున్న సాయినాథ్ సాధారణ బదిలీల్లో భాగంగా తిరుచానూరుకు బదిలీపై వచ్చారు.

ఆర్సీపురం ఎస్‌ఐగా రామాంజనేయులు



ఎస్‌ఐ రామాంజనేయులు

రామచంద్రాపురం: రామచంద్రపురం నూతన ఎస్‌ఐగా రామాంజనేయులు శుక్రవారం బాధ్యతలు చేట్టారు. తిరుపతి శ్రీ వేంకటేశ్వర యూనివర్సిటీ పోలీస్‌స్టేషన్ నుంచి ఆయన బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా ఆయనను పోలీసు సిబ్బంది సన్మానించి పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది శేఖర్, సురేష్, రమణయ్య, ధనంజయులు, రమేష్, హిమలాల్, త్యాగరాజులు, యోబు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత తప్పనిసరి

తిరుపతి మంగళం : నగరంలో పరిసరాలను పరిశుభ్రంగా తీర్చిదిద్దడం తప్పనిసరని డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ ఆదేశించారు. శుక్రవారం ఈమేరకు ఆయన మాట్లాడుతూ నగర వాసులు అధికంగా మలేరియా, డెంగీ వంటి విషజ్వరాలతో ఇబ్బందులు పడుతున్నారని వెల్లడించారు. అన్ని డివిజన్లలో ఎప్పటికప్పుడు చెత్త, మురుగును తొలగించాలని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా 14వ డివిజన్‌లోని కేశవాయినగుంటలోని మురుగుకాలువల్లో పూడిక తీయించారు.

2న కలెక్టరేట్ ఎదుట ధర్నా

తిరుపతి కల్చరల్ : పెరిగిన నిత్యావసరాల ధరలకు నిరసనగా సెప్టెంబర్ 2వ తేదీన కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టనున్నట్లు సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎ.రామానాయుడు తెలిపారు. శుక్రవారం ఈమేరకు స్థానిక సీపీఐ కార్యాలయంలో నగర శాఖ కార్యదర్శుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ధర్నాకు పెద్దసంఖ్యలో ప్రజలు తరలి వచ్చి జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో సీపీఐ నగర కార్యదర్శి విశ్వనాథ్, ఏఐటీయూసీ నేతలు కె.రాధాకృష్ణ, ఎన్‌డీ రవి, కేవై రాజా, శివ, పద్మనాభం, ప్రమీల, హరిత పాల్గొన్నారు.

బ్యాంక్ ఆఫ్ బరోడా (Bank of Baroda)
పుత్తూరు బ్రాంచ్, కె.ఎన్.రోడ్డు, పుత్తూరు.

స్వాధీనత ప్రకటన (స్థిరాస్తి/ల కొరకు)

(సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 8(1)తో చదువుకునే అనుబంధం 4 ప్రకారం)

[illegible]

తేది. 25-05-2024 నాటికి రూ.10,94,635.30 పై [illegible]

[illegible]

రుణగ్రహీత: మెస్సర్స్ శ్రీ వెంకటేశ్వర ఎంటర్‌ప్రైజెస్ [illegible] శ్రీ పి. వెంకటేష్ 20-5-168, [illegible] -517501
2. శ్రీ పి.వెంకటేష్ (ప్రొప్రయిటర్), [illegible]
ప్లాట్ నెం.302, [illegible] తిరుపతి, ఆంధ్ర-517501.

[illegible] తేది.07-06-2024 న డిమాండ్ నోటీసు జారీచేశారు.

[illegible] తేది.27-08-2024 న స్వాధీనం చేసుకున్నారు. [illegible]

తేది. 25-08-2024 నాటికి రూ.11,30,441.38 పై [illegible]

[illegible]

స్థిరాస్తి వివరములు

సేల్ డీడ్ 6008/2022, తేది. 27.10.2022 [illegible]

[illegible]

Survey No.	Sub-Division Survey No.	Extent
53/1A	53/1A1	Ac.0.10 cents
53/2	53/2B	Ac.0.62 cents
53/3	53/3B	Ac.0.64 cents
55/4B	55/4B	Ac.0.17 1/2 cents
53/2	53/2B	Ac.0.62 cents
53/3	53/3	Ac.0.63 cents
55/5	55/5	Ac.0.01 cents
55/4C	55/4C	Ac.0.18 cents
55/1A2	55/1A2	Ac.0.10 cents

తేది : 27-08-2024
ప్రదేశం : పుత్తూరు

సం/- అధీకృత అధికారి
బ్యాంక్ ఆఫ్ బరోడా